



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రభుత్వ సేవల్లో నాణ్యత పెరగాలి

కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

క్షేత్రస్థాయిలో అన్ని శాఖలు ప్రభుత్వ సేవల నాణ్యత పెంచాలని కలెక్టర్ ఎం.శ్యామ్‌ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్ పిజిఆర్ఎస్ హాలులో జిల్లా వ్యాప్తంగా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై పంచాయతీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, సర్వే, జిఎస్‌డబ్ల్యుఎస్, డీఆర్డీఏ, డ్వామా, మున్సిపల్ తదితర శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రజాభిప్రాయం మెరుగుదల, స్వామిత్వ పథకం, పన్నుల వసూలుపై కార్యాచరణ ప్రణాళిక, పిఆర్-1 అనుసరణ, నీటి ట్యాంకుల నిర్వహణ, పత్రికల్లో ప్రతికూల వార్తలు, ఎస్‌డబ్ల్యూపీసీ, సీఎస్‌సీ సేవలు, నరేగా పనులు, కంపోస్ట్ పిట్లు, వీధి దీపాల నిర్వహణ, వీధి కుక్కల సమస్య, ఇతర ముఖ్య అభివృద్ధి పనులు అమలు వాటి పురోగతిపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి అధికారి కృషి చేయాలన్నారు. ప్రతి శాఖ అధికారి తమ పరిధిలోని అంశాలపై పూర్తిస్థాయి సమాచారం కలిగి ఉండాలి. ఇందుకు సమస్యల పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం ఏర్పడేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఫీల్డ్ లెవెల్‌లో సేవల నాణ్యత పెంచాలని సూచించారు. స్వామిత్వ పథకం కింద ఆస్తి హక్కుల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని, పెండింగ్ అంశాలను వెంటనే పరిష్కరించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. గ్రామ పంచాయతీలలో పన్నుల వసూళ్లు పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, వసూళ్లలో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పీఆర్-1 నిబంధనలను అన్ని శాఖలు తప్పనిసరిగా పాటించాలని, జాప్యానికి తావులేకుండా నిర్ణీత గడువుల్లో పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లోని నీటి ట్యాంకుల శుభ్రత, నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్‌డబ్ల్యూపీసీ, సీఎస్‌సీ సేవలు ప్రజలకు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సేవల నాణ్యత, స్పందనలో లోపాలు లేకుండా చూడాలని అన్నారు. ప్రతి మండలం, గ్రామంలో ఎస్‌డబ్ల్యూపిసి సరిగా పనిచేయాల్సుందన్నారు. స్వచ్ఛ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలని, కంపోస్ట్ పిట్ల నిర్మాణం, వినియోగాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. వీధి కుక్కల సమస్యపై మున్సిపల్, పంచాయతీ అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిపిఒ సమత, డీఆర్డీఏ పీడీ నరసయ్య, జెడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్య, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ క్రాంతి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జీపు జాతాలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

కార్మికుల 'మహా' స్వాగతం..!

- సిఐటియు జీపుజాతాకు అపూర్వ స్పందన
- అన్ని మండలాల్లో ఘనస్వాగతం పలికిన కార్మికులు
- జాతీయ మహాసభల విజయవంతం కోరుతూ మద్దతు
- రెపరెపలాడిన సిఐటియు జెండాలు

విశాఖ పట్నంలో డిసెంబర్ 31, జనవరి 1,2,3,4వ తేదీల్లో జరిగే సిఐటియు అఖిల భారత 18వ మహాసభల విజయవంతం కోరుతూ ఆ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన జీపుయాత్ర సత్యసాయి జిల్లాలో చైతన్య భరితంగా సాగింది. జాతా పర్యటించిన అన్ని ప్రాంతాల్లోనూ కార్మికుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. శనివారం 2వ రోజు హిందూపురంలో ప్రారంభం అయిన జాతా లేపాక్షి, చిలమత్తూరు, ఓబుళదేవరచెరువు, సోమందేపల్లి, పెనుగొండ, మడకశిర ప్రాంతాల్లో కొనసాగి రాత్రి పరిగి మండలానికి చేరుకుంది. హిందూపురంలో జాతాను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు ప్రారంభించారు. అసంఘటిత రంగ కార్మికులు ఇందులో పాల్గొని సిఐటియుకు మద్దతుగా నిలిచారు. డప్పు వాయిద్యాలు, కళాకారుల గేయాలతో జాతా కార్మికులను చైతన్యం చేసింది. హక్కులకు అండ.. సిఐటియు జెండా అంటూ కార్మికులు నినాదాలు చేశారు. బహిరంగ సభలో పాల్గొనేందుకు కార్మికులు స్వచ్ఛందంగా సమాయత్తం అయ్యారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ కార్మికుల హక్కులు... చట్టాల పరిరక్షణ కోసం అన్ని రంగాల కార్మికులు సమరశీల పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల అండగా సిఐటియు నిలుస్తుందన్నారు.

ప్రజాశక్తి- హిందూపురం

సిఐటియు అఖిలభారత మహాసభల విజయవంతం కోరుతూ చేపట్టిన జాతాలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, వ్యతిరేక విధానాలను తెలియజేస్తూ కార్మికులను చైతన్యం చేసేలా జాతాలు కొనసాగాయి. హిందూపురంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘాల అధ్వర్యంలో ఎంతో మంది కార్మికులు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం చట్టాలను యాజమాన్యలకు చుట్టాలుగా మారుస్తోందన్నారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించ పోగా కొత్త సమస్యలు తెస్తున్నాయని అన్నారు. కార్మిక ఉద్యమాలను అణచాలని చూస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగక కార్మికులు అర్ధాకలితో అలాంటిస్తుంటే కార్పొరేట్ల ఆస్తులు వంద రెట్లు పెరుగుతున్నాయన్నారు. అసమానతలు, పేదరికం ఎన్నడూ లేని స్థాయికి చేరాయని, కేంద్ర ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణమని విమర్శించారు. ఈ విధానాలకు ప్రత్యామ్నాయాలను సిఐటియు జాతీయ మహాసభలో రూపొందిస్తారని చెప్పారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పీ.శ్రీనివాసులు, పట్టు రైతు సంఘం రాష్ట్ర నాయకులు ధనాపురం వెంకట్రామిరెడ్డి, సిఐటియు పట్టణ కన్వీనర్ రాము మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకూ పోరాడతామన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ సహా అన్ని ప్రభుత్వరంగ పరిశ్రమలను కార్పొరేట్లకు కారు చౌకగా కట్టబెడుతూ కార్మిక వర్గాన్ని రోడ్డుకి లాగుతోందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా పోరాటంలో భాగంగా జరిగే సిఐటియు జాతీయ మహాసభ జయప్రదానికి కార్మికవర్గమంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులతో పాటు అంగన్వాడీ, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మిగతా 6లో మెయిన్‌లో



మడకశిర ప్రధాన దారిలో యుటిఎఫ్ జెండాలను కడుతున్న ఆ సంఘం నాయకులు

నేడు మడకశిరలో యుటిఎఫ్ జిల్లా మహాసభలు

ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) 4వ జిల్లా మహాసభలు ఆదివారం మడకశిరలో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆ సంఘం నాయకులు ఇప్పటికే పూర్తి చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో యుటిఎఫ్ జెండాలు, తోరణాలతో అలంకరించారు. మడకశిర ఆర్అండ్‌బి అతిథి గృహంలో మహాసభలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

మడకశిర పట్టణంలో ఆదివారం జరిగే యుటిఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు కె.భూతన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కార్యదర్శి డి.నరసింహప్ప, సహాధ్యక్షులు బాబు కోరారు. యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యలు, ప్రభుత్వ విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. సామజిక దృక్పథంతో సమాజ సేవలోనూ సేవలు అందిస్తోందన్నారు. యుటిఎఫ్ మహాసభల్లో విద్యారంగ సమస్యల పరిష్కారంపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణపై దిశా నిర్దేశం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మడకశిర మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వివిఎస్.మాలింగప్ప, వై.జోగప్ప, గుడిబండ మండల ప్రధాన కార్యదర్శి జిఎల్.కదురన్న పాల్గొన్నారు.

ఆరు నెలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం

వందే భారత్ రైలు ప్రారంభంలో కేంద్ర మంత్రి సోమన్న - పురంలో వందేభారత్ రైలు ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రైల్వే స్టేషన్ లో జరుగుతున్న అభివద్ధి పనులను మరో ఆరు నెలల్లోపు పూర్తి చేస్తామని కేంద్ర రైల్వే, జల శక్తి సహాయ మంత్రి సోమన్న తెలిపారు. యశ్వంతపురం - కాచిగూడ మధ్య తిరిగే వందే భారత్ రైలును శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో స్టాపింగ్ ఇస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. శనివారం నాడు హిందూపురం రైల్వే స్టేషన్‌లో స్థానిక ఎంపీ పార్థసారథితో కలిసి మంత్రి జెండా ఊపి రైలును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందే భారత్ రైలు హిందూపురం రైల్వే స్టేషన్‌లో నిలపడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగకరంగా మారుతుందని తెలిపారు. అమృత్ పథకంలో భాగంగా హిందూపురం, పుట్టపర్తి రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. హిందూపురం రైల్వే స్టేషన్ సుందరీకరణ కోసం ఇప్పటికే రూ. 23 కోట్లు మంజూరు చేశామన్నారు. 2026 జూన్ నాటికి పనులు పూర్తి చేసి హిందూపురం రైల్వే స్టేషన్‌ను అన్ని విధాల సుందరికరణ చేసి జాతికి అంకితం చేస్తామన్నారు. ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ ప్రజలు, ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చిన విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుని వందే భారత్ రైలును హిందూపురంలో స్టాపింగ్ మంజూరు చేయడం అభినందనీయమని అన్నారు. ఇది వేలాదిమంది ప్రయాణికులకు లాభం చేకూర్చే నిర్ణయం అన్నారు. కర్ణాటక రాష్ట్రం చిక్కబళాపురం నుంచి బాగేపల్లి మీదుగా పుట్టపర్తి వరకు నూతన రైల్వే లైన్ పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఇదే సందర్భంగా విలేకరులు బెంగళూరు నుంచి హిందూపురం మీదుగా పుట్టపర్తికి ఒకటి, ధర్మవరానికి మరొకటి రైళ్లు నడుస్తుంటే ఇందులో ఒక రైలులో రద్దుచేసి, ఒక రైలును అనంతపురం వరకు పొడిగించడంతో ఇబ్బందిగా మారిందని తెలిపారు. కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు వారంలో మూడు రోజులే నడుస్తున్నదని దీనివల్ల విజయవాడకు వెళ్లడానికి ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటితో పాటు హిందూపురం రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలపై మంత్రిని ప్రశ్నించారు. ఈ అంశాలపై మంత్రి పరిశీలన చేసి పరిష్కరిస్తామన్నారు. ఇదే అంశంపై ఎంపీ పార్థసారథి హిందూపురం రైల్వే స్టేషన్‌లో ఉన్న సమస్యలతో పాటు కొండవీడు ఎక్స్ ప్రెస్ రైలును వారంలో ఏడు రోజులు నడిపే విధంగా, ధర్మవరం-విజయవాడ మధ్య తిరిగి మచిలీపట్నం ఎక్స్ ప్రెస్ రైలు హిందూపురం వరకు అడిగించాలని, పెనుగొండ రైల్వే స్టేషన్‌లో బసవ, కూర్ల ఎక్స్‌ప్రెస్ రైళ్లను స్టాపింగ్ ఇవ్వాలని కోరుతూ మంత్రికి వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, బాలకష్ణ పిఎ బాలాజీ, టిడిపి నాయకులు, ఎడిఆర్ఎం ప్రవీణ్, సీనియర్ డిఎన్ కోఆర్డినేషన్ రాజీవ్ శర్మ, సీనియర్ డిసిఎం కష్ణ చైతన్య, డిఈఈఎన్ హరిత గుప్తా, చీఫ్ ఇంజినీర్ ప్రేమ్‌నారాయణ్‌తో పాటు రైల్వే అధికారులు, స్థానిక స్టేషన్ మాస్టర్ రామచంద్రనాయక్, అధికారులు సోమప్ప, కిరణ్, ఆనంద్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సోమన్న

ఖైదీల ప్రవర్తనలో మార్పు రావాలి

అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ



రిమాండ్ ఖైదీలతో వివరాలు తెలుసుకుంటున్న అదనపు జిల్లా జడ్జి కం పల్లె శైలజ

ప్రజాశక్తి-హిందూపురం

క్షణికావేశంలో చేసిన తప్పులకు కారాగారాలకు వచ్చిన రిమాండ్ ఖైదీల ప్రవర్తనలో మార్పు రావాలని అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ సూచించారు. శనివారం స్థానిక ఉపకారాగారాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపకారాగారంలో ఉన్న రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. ఎప్పటినుండి కారాగారంలో ఉంటున్నారు.. న్యాయవాదులు ఉన్నారా.. ఎలాంటి కేసులు నమోదయ్యాయి తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా ఉపకారాగారంలో సౌకర్యాలు, భోజనం తదితర అంశాలపై కూడా చర్చించారు. అనంతరం ఏడీజే మాట్లాడుతూ తప్పులు చేసి జైళ్లకు రావడం వల్ల అటు కుటుంబాల గౌరవ మర్యాదలు దెబ్బ తినడంతో పాటు ఇటు ఆర్థికంగా కూడా ఇబ్బందులకు గురికావాల్సి ఉంటుందన్నారు. పలువురు నిందితులు బెయిల్ మంజూరైనా జామీనుదారులను ఏర్పాటు చేసుకోలేకపోవడం వల్ల బయటకు వెళ్లలేకపోతున్నట్లు తెలిపారు. ప్రవర్తన మార్చుకుని జీవితంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత జీవనం సాగించాలని సూచించారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న ఖైదీలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని, అలాంటివారికి ఉచిత న్యాయ సహాయం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది నవేరా, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం


ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరి టౌన్

విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను రెండు రోజుల్లో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ఆయన శనివారం ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలను సందర్శించి కాసేపు విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలలో నెలకొన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు కుళ్లిన కూరగాయలు, పురుగులు పడిన ఆహారం వడ్డించడంపై వెంటనే స్పందించి సంబంధిత కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి ప్రిన్సిపల్‌పై శాఖా పరమైన చర్యలు చేపట్టామన్నారు. ఈ నెల 29వ తేదీ లోపు పాఠశాలలో నెలకొన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మళ్లీ రెండు రోజుల్లో పాఠశాలలను సందర్శిస్తానన్నారను. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

ప్రజాదర్బార్‌లో వినతుల వెల్లువ

ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కదిరి పట్టణంలోని 5వ వార్డులో శనివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించగా ప్రజలు భారీగా తరలివచ్చి అర్జీలు సమర్పించారు. వాటిలో చాలా వాటిని ఎమ్మెల్యే పలు అక్కడికక్కడే పరిష్కరించారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలను త్వరితగతిన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజలు వారి సమస్యలను చెప్పుకునేందుకు వస్తే వారిని ఎక్కడిక్కడ అడ్డుకొని బారికేడ్లతో నిలువరించి అనేక ఇబ్బందులకు గురిచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేడు ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరినీ నేరుగా కలిసి విజ్ఞప్తులు స్వీకరించడంతో పాటు వారి సమస్యలను అక్కడికక్కడే అధికారులతో చెప్పి పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కమిషన్ డైరెక్టర్ పర్వీన్‌భాను, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దిల్షాద్, ఆర్డీవో వివిఎస్.శర్మ, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు, టిడిపి వార్డు ఇన్‌ఛార్జిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

అందరి సహకారంతో పట్టణాభివృద్ధి

ఛైర్మన్ డిఈ.రమేష్‌కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకష్ణ ఆశయాలకు అనుగుణంగా పట్టణ అభివద్ధికి అందరూ సహకరించాలని మున్సిపల్ ఛైర్మన్ డిఈ.రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున కోరారు. శనివారం మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డులో నూతన రహదారులు, మురికి కాలువల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకష్ణ హిందూపురం అభివద్ధి కోసం రూ.92.50 కోట్లు ఇటీవల విడుదల చేశారన్నారు. అందులో భాగంగా రూ.15 లక్షల వ్యయంతో ఎస్‌డిజిఎస్ కళాశాల పాత గేటు సమీపంలో నూతన రహదారి, కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతంలో రహదారులు మురికి కాలువలు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలోనే హిందూపురం అభివృద్ధి దిశగా వెళ్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, మైనార్టీ కమిషన్ డైరెక్టర్ షఫీవుల్లా, టీడీపీ సీనియర్ నాయకులు అమరనాథ్, భాస్కర్, డైమండ్ బాబా, మైనార్టీ పట్టణ అధ్యక్షులు అన్వర్, తిరుపతయ్య, అజ్మతుల్లా, అశ్వర్థ నారాయణ, షబ్బీర్, డిఈఈ వాణి, ఏఈలు రాజేంద్ర, ధీరజ్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



భూమి పూజ చేసి పనులను ప్రారంభిస్తున్న ఛైర్మన్, బాలయ్య పీఏ వీరయ్య

పిల్లల భవిష్యత్తు, ఆరోగ్యానికి పునాది అంగన్వాడీలు

అసంపూర్తి భవనాల నిర్మాణం పూర్తి చేస్తాం- మంత్రి సవిత



అంగన్వాడీ కార్యకర్తలకు సెల్‌ఫోన్లు అందిస్తున్న మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

భావితరాల పిల్లల భవిష్యత్తు, ఆరోగ్యానికి పునాది అంగన్వాడీ కేంద్రాలు అని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అన్ని అంగన్వాడీ భవనాలను త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆమె పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 459 మంది అంగన్వాడీ వర్కర్లకు 5జీ సెల్‌ఫోన్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 57 మంది మినీఅంగన్వాడీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు 5జి సెల్‌ఫోన్లు పంపిణీ చేస్తోందన్నారు. పిల్లల పోషణ, బరువు, ఎత్తు కొలతలు వంటి వాటిని తప్పనిసరిగా నమోదు చేయాల న్నారు. పిల్లలకు మరో తల్లిలాగా అన్నీ నేర్పేది అంగన్వాడీలే అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలన్నారు. బాల్య వివాహాలపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించి బాల్య వివాహాలను అరికట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో యాదవ,వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్లు కేశవయ్య, డివి.ఆంజనేయులు, మంజునాథ్, టిడిపి మండల కన్వీనర్ దండు ఈశ్వరప్రసాద్, నాయ కులు మాధవనాయుడు, బాలాజీ, గోవిందరెడ్డి, ఆంజనేయులు, వెంకటేశు లు, సిద్దలింగప్ప, సిడిపిఒలు శాంతలక్ష్మి, ధనలక్ష్మి, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సిఐటియు జీపుజాతా

ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకూ విశాఖపట్నంలో నిర్వహించనున్న సిఐటియు అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయడంలో భాగంగా జిల్లాలో చేపట్టిన సిఐటియు జీపుజాతాకు శనివారం అడుగడుగునా మంచి స్పందన వచ్చింది. జీపుజాతా కొనసాగిన ప్రాంతాల్లో కార్మికులు, కర్షకులు, కూలీల నుంచి మద్దతు లభించింది. ఆయా మండల కేంద్రాల్లో ప్రధాన కూడళ్లలో సిఐటియు నాయకులు మహాసభల ప్రాధాన్యత వివరించారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ప్రధానంగా జనవరి 4వతేదీ జరిగే భారీ బహిరంగ సభకు కార్మికలోకం పెద్దఎత్తున తరలి వెళ్లి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.


సోమందేపల్లిలో జీపుజాతాలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి : సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-ఓబులదేవచెరువు

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుందామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు పిలుపునిచ్చారు. ఓడిసిలో బిటిఐ కళాశాల ఆవరణలో ఓబులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా, కార్మికులకు నష్టం చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం నెలకు రూ. 26వేలు ఇవ్వాలని, స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, హమాలీ, ఆటో, ప్రయివేట్ ట్రా (ట్రాన్స్‌పోర్ట్), తదితర అసంఘటిత రంగ కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయా లని, విద్య, వైద్యాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని, కనీస పెన్షన్ నెలకు రూ. 9 వేలు ఇవ్వా లని, ఒపిఎస్‌ను అమలు చేయాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి లక్ష్మీనారాయణ, నాయకులు వివి రమణ, మండల కన్వీనర్ కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేద్దాం : జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు

సోమందేపల్లి : విశాఖలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేద్దామని సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు కార్మికులకు పిలుపునిచ్చారు. మహాసభలను విజయ వంతం చేయాలని కోరుతూ జిల్లాలో చేపట్టిన జీపుజాతా సోమందేపల్లిలో కొనసాగింది. స్థానిక ప్రధాన కూడలిలో కార్మికులను ఉద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, జిల్లా సహాయ కార్యదర్శి బిఆర్.రాము మాట్లాడారు. 11 ఏళ్లుగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తుందన్నారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తుంద న్నారు. పెట్టుబడిదారుల దోపిడికి అడ్డగా కార్మిక చట్టాలను మార్చి 4 లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిం దన్నారు. అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని, ఈఎస్ఐ అమలు కావడం లేద న్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌లో 5వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను ఎటువంటి నోటీసులు, నష్టపరిహారం లేకుండా యజమాన్యం తొలగించిందని మండి పడ్డారు. 78 ఏళ్ల స్వతంత్ర భారతంలో కార్మిక వర్గం ఎన్నడూ ఇలాంటి కష్ట కాలాన్ని చూడలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో యావత్తు కార్మిక వర్గాలను ఏకం చేసి కార్మిక హక్కులను సాధించేందుకు సిఐటియు నిర్వహిస్తున్న అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సి పల్ యూనియన్ నాయకులు రామాంజులు, సిఐటియు నాయకులు కొండా వెంకటేష్, చేనేత సంఘం నాయకులు మాబు, నాగభూషణ, గోవిందప్ప, సుధాకర్, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.


చిలమత్తూరులో..


పెనుకొండలో జీపుజాతాలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి

పెనుకొండ : విశాఖపట్నంలో జరిగే సిఐటియు ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో చేపట్టిన ప్రచార జీపుజాతా పెనుకొండకు చేరుకుంది. పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి అధ్యక్షతన సభ నిర్వహించారు.

అన్ని వర్గాల ప్రజల నుంచి స్పందన

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ మహాసభలకు దేశ వ్యాప్తంగా 2 వేల మంది డెలిగేట్స్ హాజరై కార్మికుల సమస్యలపై సుదీర్ఘ చర్చలు నిర్వహించి దిశా, దశ, నిర్దేశం చేస్తారన్నారు. ప్రధానంగా పెంచిన పని గంటలు, కనీస వేతనం అమలు, వెట్టి చాకిరీ, పని ప్రదేశాల్లో మహిళలపై దాడులను అరికట్టాలని, అంగన్వాడీ, ఆశా వర్కర్స్‌ను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకట రాముడు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి మాట్లాడుతూ జనవరి 4వ తేదీ జరిగే భారీ బహిరంగ సభకు సంఘటిత, అసంఘటిత కార్మికులు, అంగన్వాడీ, ఆశా, మున్సిపాలిటీ, ఆటో, సివిల్ సప్లై, తోపుడు బండ్ల కార్మికులు అధిక సంఖ్యలో తరలివెళ్లి జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు హిందూపురం రాము, రామాంజనేయులు, నాయకులు వెంకటేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు నరసింహ, సిఐటియు నాయకులు జబ్బార్, చలపతి, రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు ఫక్రుద్దీన్, శ్రీనివాసాచారి, రుద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : లేపాక్షిలోని ప్రధానకూడలిలో సిఐటియు జీపుజాతా సభ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కార్మికులు, కర్షకుల కోసం నిర్వహిస్తున్న సిఐటియు జాతీయ మహాసభలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్మికుల పనిగంటలు పెంచవద్దని, అంగన్వాడీ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు, కార్మిక సంఘం కార్యదర్శి ఫిరంగి ప్రవీణ్‌కుమార్, శోభ, ధనమ్మ, కృష్ణమూర్తి, అంగన్వాడీ కార్యకర్తలు భాగ్యమ్మ, మాధవి, పార్వతి, ఉపాధి హామీ కూలీలు, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : విశాఖపట్నంలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు జడ్పీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా శనివారం మధ్యాహ్నం చిలమత్తూరు మండలానికి చేరుకుంది. జడ్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల అంగన్వాడీ, ఆశా, పంచాయతీ, పారిశుధ్య కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల వేతనాలు పెంచకుండా, హక్కులు కల్పించకుండా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. కార్మిక వర్గం ఐక్యంగా పోరాటం చేస్తేనే హక్కులు సాధించుకోవచ్చని, ఆ దిశగా సిఐటియు 18వ జాతీయ మహాసభలు కీలక మలుపుగా నిలవనున్నాయని తెలిపారు. ప్రతి కార్మికుడు, ఉద్యోగి మహాసభలను విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి రాము, సిఐటియు మండల కన్వీనర్ రామచంద్ర, కోకన్వీనర్ వెంకటేష్, లేపాక్షి సిపిఎం నాయకులు కృష్ణమూర్తి, గోరంట్ల సిపిఎం నాయకులు కమల్‌బాషా, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి శోభారాణి, వనజ, షబానా, అశ్వర్థమ్మ, గ్రామపంచాయతీ కార్మికులు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఓడిసిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

మడకశిర టౌన్ : విశాఖలో జరిగే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సిఐటియు జీపుజాతా మడకశిర పట్టణంలో సాగింది. స్థానిక అమరాపురం బస్టాండ్‌లోని వైఎస్ఆర్ సర్కిల్‌లో నాయకులు మాట్లాడుతూ విశాఖలో జరిగే జాతీయ మహాసభలకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని, లేబర్ కోడ్‌లు


లేపాక్షిలో..

రద్దు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, తదితర డిమాండ్ల పరిష్కారంపై సమావేశాల్లో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆఫీస్ బేరర్ రాము, సివిల్ సప్లై నాయకులు నాగరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి శ్రీదేవి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, శాంతకుమారి, కళావతి, మానస, వీణ, రవి, ముత్యాలప్ప, తదితరులు పాల్గొన్నారు.


మడకశిరలో సిఐటియు జీపుజాతాలో మాట్లాడుతున్న నాయకులు

డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం

'మత్తు' అనర్థాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి : కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని, అందులో ప్రతిఒక్కరూ భాగ స్వాములు కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ పిలుపు నిచ్చారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. డ్రగ్స్ రహిత జిల్లా కోసం పాటు పడి యువతను కాపాడుకునేలా అందరూ బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. పట్టణంలోని కలెక్టరేట్‌లో ఉన్న మినీ కాన్ఫరెన్స్ హాలులో శనివారం ఎస్పీ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన ఈగల్ అండ్ ఎక్కార్డ్ మీటింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో గంజాయి, మత్తుపదార్థాల నివారణకు తీసుకోవాల్సిన పటిష్టమైన చర్యలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున కృషి చేస్తుందన్నారు. జిల్లా స్థాయిలో మాదకద్రవ్యాలను నియంత్రించడానికి అనేక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన కలిగిస్తున్నామన్నారు. ఏ వ్యక్తి అయినా చెడు అలవాట్లు, మాదకద్రవ్యాలకు బానిసైతే తన ఎదుగుదలకు తానే అడ్డుకట్ట వేసుకోవడంతో పాటు ఆర్థికంగా, మానసికంగా, కుటుంబ బంధాలకు దూరమయ్యే అవకాశం ఉంటుందన్నారు. అటువంటి పరిస్థితి తలెత్తకుండా ఉండేందుకు విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించడానికి ప్రతి పాఠశాల, కళాశాలల్లో ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. చెడు వ్యసనాలు, చెడు స్నేహాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. దేశ అభివద్ధిలో యువత పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలన్నారు. ముఖ్యంగా చిన్న చిన్న పిల్లలు టైర్ పంక్చర్ పేస్ట్, కాఫ్ సిరప్ ద్వారా మత్తుకు చేరువవుతున్నట్లు నివేదికలు తెలుపుతున్నాయన్నారు. పాఠశా లలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా సూచనలు, వీడియోలు ప్రదర్శించాలన్నారు. అలాగే నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ 2025లో 12 కేసుల్లో 32 కిలోల గంజాయి సీజ్ 51 మందిని


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, చిత్రంలో ఎస్పీ, అధికారులు

అదుపులోకి తీసుకుని 7 వాహనాలు సీజ్ చేశామన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడిన యువత వివిధ రకాల నేరాలకు పాల్పడే అవకాశం ఉంటుంద న్నారు. గతంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా 'డ్రగ్స్ వద్దు బ్రో' నినాదాన్ని పెద్ద ఎత్తున ప్రచారం చేశామన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటున్నారని తెలిస్తే 1972 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. మాదక ద్రవ్యాల వ్యసనపరులకు ప్రభుత్వ ఆసుపత్రిలో రీహాబిలిటేషన్ ఏర్పాటు చేశామన్నారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన చట్టాలు చాలా కఠినంగా ఉంటాయని, డ్రగ్స్ బారిన పడకుండా చైతన్యం కలిగి ఉండాలన్నారు. అంతకు ముందు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా జిల్లాలో చేపట్టిన చర్యలను ఎస్పీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో పోలీసు అధికారి లక్ష్మీకాంతరెడ్డి, ఈగల్ ఎస్ఐ శ్రీహరి, డీఈవో కిష్టప్ప, డిఆర్‌డిఎ పిడి నర్సయ్య, డిఐఒ సయ్యద్ ఓలా, వైద్యశాఖ వీరకుమార్‌రెడ్డి, ఎక్సైజ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'బలిజ వివాహ పరిచయ వేదిక'

ప్రజాశక్తి-కదిరి టౌన్


తలుపుల మండల బలిజ, యువజన విభాగం ఆధ్వర్యంలో ఆదివారం కదిరి పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో 'బలిజ వివాహ పరిచయ వేదిక' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఇంజినీర్ బివి రమణ తెలిపారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కదిరి పట్టణంతో పాటు పరిసర మండలాల, గ్రామాల్లోని బలిజ సమాజిక వర్గం ప్రజలు 'బలిజ వివాహ పరిచయ వేదిక'ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హాజరయ్యే తల్లిదండ్రులు వధువు లేదా వరుడు కార్డు సైజు ఫొటో, బయోడెటా వివరాలు తప్పని సరిగా తీసుకొని రావాలన్నారు. ఈ కార్యక్రమానికి ఎలాంటి రుసుము చెల్లించాల్సి అవసరం లేదన్నారు. వివరాలకు 94419 18856, 91105 38241, 94410 05453లో సంప్రదించాలన్నారు.

యుటిఎఫ్ మోడల్ పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని దొడఘట్ట జడ్పీ హైస్కూల్‌లో శనివారం పదో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయులు యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉచితంగా మోడల్ పేపర్లు పంపిణీ చేశారు. యుటిఎఫ్ రొద్దం ప్రధాన కార్యదర్శి కురుబ మారుతి ఆధ్వర్యంలో యుటిఎఫ్ రొద్దం శాఖ సొంత నిధులతో మోడల్ పేపర్లను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. మారుతి మాట్లాడుతూ సామాజిక స్పృహలో భాగంగా యుటిఎఫ్ విద్యార్థుల కోసం కొన్నేళ్ల నుంచి చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. కన్వీనర్ అశోక్ మాట్లాడుతూ ఈ మోడల్ పేపర్లను ఉపయోగించుకొని విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని సూచించారు. యుటిఎఫ్ చేస్తున్న సేవా కార్యక్రమలు, కృషి, మోడల్ పేపర్ల విలువను ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు సరస్వతి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు పరమేష్, రజనీకాంత్, వెంకటస్వామి, బాలయ్య, నాగార్జున, నవీన్, తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు మోడల్ పేపర్లు పంపిణీ చేసిన యుటిఎఫ్ నాయకులు


బెలూన్‌లు ఎగర వేసి ఆటను ప్రారంభిస్తున్న చైర్మన్ తదితరులు

ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

క్రీడలను అభ్యసనం చేయడానికి ఒక వయసు ఏమాత్రం అడ్డు కాదని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు వీరయ్య, బాలాజీ, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పావులూరి శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయ సమీపంలో టెన్నిస్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజూ టెన్నిస్ ఆట ఆడటం వల్ల శారీరక దఢత్వం, మానసిక ఆరోగ్యం, ఎముకల బలం, గుండె ఆరోగ్యం మెరుగుపడతాయని తెలిపారు. క్రమం తప్ప కుండా క్రీడలను అభ్యసనం చేయడం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాకులు నెట్టప్ప, రాజ్యలక్ష్మీ మోహన్, విజయ్ కుమార్, కొండారెడ్డి, నగేష్, నరసింహ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, మైనార్టీ కమిషన్ డైరెక్టర్ షఫీవుల్లా, టీడీపీ నాయకులు అమరనాథ్ , భాస్కర్ (బాచి), డైమండ్ బాబా, అజ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న శనివారం హిందూపురంలో జెండా ఊపి వందే భారత్ రైలును ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని కూటమి నాయకులు హిందూపురం వెళ్లి కేంద్ర మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ముదిగుబ్బలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలని, అలాగే ముదిగుబ్బ టు పుట్టపర్తి రైల్వే గేట్-25 నంబర్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సోమలప్రకాష్, రమేష్‌బాబు, సూర్యనారాయణ, వెంకటనారాయణ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నిరంతర అభివృద్ధి

రైల్వే, జలశక్తి కేంద్ర సహాయ మంత్రి వి.సోమన్న

చాకర్లపల్లి రైల్వేస్టేషన్ ప్రారంభం.. జాతికి అంకితం

ప్రజాశక్తి-సోమందేపల్లి

కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధి నిరంతరంగా కొనసాగుతోందని రైల్వే, జలశక్తి కేంద్ర సహాయ మంత్రి వి.సోమన్న తెలిపారు. మండలంలో పునరాభివృద్ధి చేయబడిన చాకర్లపల్లి రైల్వేస్టేషన్‌ను శనివారం కేంద్ర సహాయ మంత్రి వి.సోమన్న రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె.పార్థ సారథిలతో కలిసి ప్రారంభించి జాతికి అంకితం చేశారు. వారు మాట్లాడుతూ చాకర్లపల్లి రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి ద్వారా ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ అభివృద్ధి స్థానిక ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు, ఈ ప్రాంత ఆర్థిక, సామాజిక పురోగతికి గణనీయంగా దోహదపడుతుందన్నారు. పెనుకొండ పట్టణం చారిత్రక ప్రాధాన్యత కలిగి ఉండడంతో పాటు పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పెనుకొండ రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించి అప్‌గ్రేడేషన్ చేయాలని మంత్రి సవిత కేంద్ర మంత్రిని కోరారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఇప్పటికే మంజూరైన చాకర్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని రోడ్ ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఒబి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. పెనుకొండ నుంచి పావగడ వరకూ కొత్త రైల్వేలైన్ ఏర్పాటు దిశగా సర్వే నిర్వహించి అనుమతి



రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న కేంద్ర మంత్రి సోమన్న, రాష్ట్ర మంత్రి సవిత, ఎంపి పార్థసారథి

ఇవ్వాలని కోరుతూ, ఈ రైల్వే లైన్ ద్వారా రెండు రాష్ట్రాల మధ్య రవాణా, వాణిజ్య కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. అలాగే పెనుకొండ ప్రజల ప్రయాణ సౌకర్యాల దృష్ట్యా బసవ ఎక్స్‌ప్రెస్, లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్, యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను పెనుకొండ రైల్వే స్టేషన్‌లో స్టాపింగ్ పెట్టాలని మంత్రి సవిత కేంద్ర మంత్రి వి.సోమన్నకు ప్రత్యేకంగా విన్నపించారు. కార్యక్రమంలో రైల్వే శాఖ ఉన్నతాధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణం బెంగళూరు రోడ్డులో వెలసిన అయ్యప్ప స్వామి దేవాలయంలో మండల పూజను శనివారం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, అన్నదాన కమిటీ అధ్యక్షులు డిఈ. రమేష్ కుమార్ మాట్లాడుతూ లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ రమానంద అన్నదానం కోసం లక్ష రూపాయలు వితరణ చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నంబూరి శంకర్, గురుస్వామి రవి ఠాగూర్, రాష్ట్ర రోడ్ల అభివద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్ర మోహన్ యాదవ్, జనసేన నాయకులు నిమ్మకాయల రాము, టీడీపీ నాయకులు దుర్గా నాని, ఎన్‌బికె రాజు పాల్గొన్నారు.


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న లేపాక్షి ఆలయ చైర్మన్ రమానందన్


ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎంఇఒలు

ఉపాధ్యాయురాలికి సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం

ముద్దిరెడ్డిపల్లి సౌత్ పాఠశాలలో శనివారం నాడు సృజనాత్మక ఉపాధ్యాయురాలు సవితను మండల విద్యాశాఖ అధికారులు గంగప్ప, ప్రసన్న లక్ష్మి సన్మానించారు. "బడి విలువల బడి కావాలి" పేరిట ఉపాధ్యాయురాలు సవిత విద్యార్థులకు వినూత్నంగా విద్యాబోధన సాగిస్తున్నారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ బడి విలువల బడి కావాలి అని ఆకాంక్షించారు. విద్యార్థులు కథలపై ఆసక్తి పెంచుకోవాలని, అందులో ఉన్న విలువలను ఆచరించాలని తెలిపారు. పిల్లల భావ వికాసం, భావవ్యక్తీకరణ పెంపొందించుకోవాలని తెలిపారు. ఇందులో భాగంగా షిరోస్ పుస్తక ప్రదానం ద్వారా ఆమెకు ఘనంగా సృజనాత్మక టీచరుగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక కబ్జాపై ప్రజాసంఘాల ఫిర్యాదు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూ శ్మశాన వాటికను కబ్జా చేసిన పట్టణంలోని ఎస్‌డిజిఎస్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని శనివారం ప్రజాసంఘాలు, పలు రాజకీయ పార్టీల నాయకులు రెవెన్యూ అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి పార్టీ జిల్లా కార్యదర్శి ఏ. శ్రీనివాసులు, దళిత సమైక్య జిల్లా అధ్యక్షులు ఎస్.నారాయణ, జై భీమ్ రావు భారత్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఊటుకూరు నాగరాజు, వెంకటేశులు, శివశంకరప్ప, ఇమ్మానియేల్. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ హిందూపురం పట్టణంలోని శ్రీకంఠాపురం గ్రామ పొలంలో సంబంధిత కళాశాల పక్కన ఉన్న హిందూ శ్మశాన వాటికకు సంబంధించిన సర్వేనెంబర్308-4, 308-5, 308-6 మొత్తం ఆరు ఎకరాల 92 సెంట్లు 1965 రెవెన్యూ అధికారులు కేటాయించడం జరిగిందని తెలిపారు. అయితే 6-92 సెంట్లు గాను శ్మశానానికి ఎకరా 10 సెంట్లు మాత్రమే మిగిల్చి 5 ఎకరాల 82 సెంట్లు భూమిని ఎస్.డి.జి.ఎస్ కళాశాల యాజమాన్యం మొత్తం కబ్జా చేసిందని ఆరోపించారు. అధికారులు శ్మశాన వాటిక స్థలాన్ని కబ్జా చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా కాపాడే వ్యక్తి పైనే చర్యలు తీసుకోవడానికి పూనుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుని హిందూ శ్మశాన వాటికను పరిరక్షించాలని


రెవెన్యూ అధికారికి వినతిని ఇస్తున్న నాయకులు

లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



టిడిపి పార్లమెంటరీ సెక్రటరీ షామీర్‌ను అభినందిస్తున్న ముస్లిములు

టిడిపి పార్లమెంటరీ సెక్రటరీ షామీర్‌కు సన్మానం

ప్రజాశక్తి-శెట్టూరు

టిడిపి పార్లమెంట్ సెక్రటరీ కొలిమి షామీర్‌ను శనివారం స్వగృహంలో నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శెట్టూరు ముస్లిం మైనారిటీ మైనార్టీ మత పెద్దలు మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గం చరిత్రలో ముస్లిములకు టిడిపి పదవుల్లో జిల్లాస్థాయి పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే అమలినేని సురేంద్రబాబు ముస్లిములకు సముచిత స్థానం కల్పించడం గర్వకారణమన్నారు. షామీర్ మాట్లాడుతూ తనకు పదవి ఇచ్చినందుకు టిడిపి అధినేత చంద్రబాబు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించడంతోపాటు పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి గురుబి, మాజీ ఎంపిపి చిత్తప్పబి, శెట్టూరు మండలం ముస్లిముల కార్యనిర్వాహక (ఖాజీ) నసీర్‌సాబ్, మండల ముస్లిం మైనార్టీ పెద్దలు అమీర్ సాబ్, షాజహాన్, సద్దాం, మునీర్, ఇబ్రహీం, రసూల్, షరీఫ్, ఇమ్రాన్‌ఖాన్, జావీద్, యాటకల్ కరీంసాబ్, కళ్యాణదుర్గం మండలం మోతికాపురం ఇమాంవలి, తదితరులు పాల్గొన్నారు.

'సుబ్బరాయసాగర్'ను పూర్తిగా నింపుతాం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు

పుట్లూరు మండలంలోని సుబ్బరాయ సాగర్‌ను పూర్తిస్థాయిలో నీటితో నింపుతామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. అమేరకు శనివారం నార్పల మండలం దయ్యాలకుంటపల్లి వద్ద ఉన్న హెచ్చెల్సీ 20వ డిస్ట్రిబ్యూటరీ వద్దకు ఎమ్మెల్యే చేరుకుని స్వయంగా నీటి ప్రవాహ పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని సుబ్బరాయ సాగర్‌ను నీటితో నింపడంతోపాటు అక్కడి నుంచి పుట్లూరు, కోమటికుంట్ల, గరువు చింతలపల్లి చెరువులు, అలాగే 29వ డిస్ట్రిబ్యూటరీ ద్వారా బొప్పేపల్లి చెరువుకు నీటిని అందిస్తామన్నారు. సుబ్బరాయ సాగర్‌కు నీటి సరఫరా సజావుగా జరిగేందుకు మిగిలిన అన్ని డిస్ట్రిబ్యూటరీల వద్ద ప్రస్తుతం నీటి ప్రవాహాన్ని సమతుల్యం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారన్నారు. ఈ విషయాన్ని రైతులందరూ గమనించి సహకరించాలని కోరారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని తరిమెల గ్రామంలో కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కంచిరెడ్డి కరుణాకర్‌రెడ్డిఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప స్వామి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా అయ్యప్పస్వామి విగ్రహానికి అభిషేకాలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా పూలతో ప్రత్యేక అలంకరించిన వాహనంలో కొలువుదీర్చి రామ మందిరం నుంచి పురవీధుల గుండా డప్పు వాయిద్యాల మధ్య అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవానికి వచ్చిన అయ్యప్ప స్వాములకు కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కంచిరెడ్డి కరుణాకర్‌రెడ్డి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు చిన్నయ్య, హరి స్వాములు, మహిళలు, పుర ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో పాల్గొన్న అయ్యప్పస్వామి మాలధారులు

ప్రజాశక్తి నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరాపురం

స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శనివారం సింగిల్‌విండో అధ్యక్షులు గణేష్ ప్రజాశక్తి-2026 కోర్ట్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక నిరంతరం ప్రజల పక్షాన పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ ధనుంజయ, టిఎన్‌టియుసి కార్యదర్శి మంజన్న, దివాకర్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ గిరీష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎపిఒ శివన్న, ఎపిఎం ముత్యాలప్ప ప్రజాశక్తి-2026 కోర్ట్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రజాశక్తి ప్రజలు, అధికారులు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తుందన్నారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను లేవనెత్తుతుందన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు సుజాతమ్మ, వరలక్ష్మి, సీసీలు నాగరాజురెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి నూతన క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

ఏ వర్గానికీ వ్యతిరేకం కాదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

దాతల సహకారంతో వాహనాలు సమకూర్చామని, ఏ వర్గానికీ వ్యతిరేకం కాదని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్పష్టం చేశారు. కదిరి పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో శనివారం ఎమ్మెల్యే మీడియా సమావేశంలో మాట్లాడారు. కదిరి నియోజకవర్గంలోని అన్ని పోలీస్ స్టేషన్లకు దాతల సహకారంతో వాహనాలు సమకూర్చామని తెలిపారు. ఆ వాహనాలను పోలీస్ శాఖకు అప్పగించే సందర్భంగా స్థానిక ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి గుడి ఆవరణలో పూజలు చేసి, తర్వాత గుడి బయట సర్వమత ప్రార్థనలు చేయించి అప్పజెప్పాలనే ఆలోచనతోనే కార్యక్రమం చేశామన్నారు. మంచి ఆలోచనతో చేసిన ఈ కార్యక్రమాల్ని అపార్థం చేసుకోవద్దని కోరారు. వాహనాల విషయంలో రాజకీయం చేయాలనే ఆలోచన లేదన్నారు. కొందరు ఈ మధ్యకాలంలో సోషల్ మీడియా వేదికగా చేస్తున్న ఆలోచనలు, వ్యాఖ్యలకు ముగింపు పలకాలని ప్రెస్‌మీట్ పెట్టానన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

వికలాంగుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

వికలాంగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై శనివారం రాష్ట్ర దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు షఫీ ఆధ్వర్యంలో రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ గోగుల చక్రపాణి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో వికలాంగులకు కేటాయించిన సీట్లలో వారిని కూర్చునే విధంగా ఆర్టీసీ ఉన్నతాధికారులకు ఆదేశాలు ఇవ్వాలని, ప్రభుత్వ కార్యాలయాలకు వివిధ పనులపై వెళ్లే వికలాంగులకు అనుకూలంగా ర్యాంపు ఏర్పాటు చేయాలని, వికలాంగులపై దాడులు జరిగినప్పుడు పోలీసులు 2016 వికలాంగుల హక్కుల చట్టం తప్పకుండా అమలు చేయడంతో పాటు న్యాయం చేసేలా పోలీస్ శాఖ ఆదేశాలు జారీ చేయాలని, తదితర సమస్యలను ఏకరువు పెట్టారు. వినతి ఇచ్చిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజి, ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి, వీరేష్, ధనుంజయ, ఈశ్వరప్ప, రామచంద్రారెడ్డి, గజేంద్ర, నాయకులు, వికలాంగులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సంఘం నాయకులు

అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అంగన్వాడీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ఈమేరకు శనివారం నగరంలోని క్యాంపు కార్యాలయంలో అర్బన్ నియోజకవర్గ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు మంజూరైన సెల్‌ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్వాడీలు పిల్లలు, గర్భిణులు, బాలింతలకు వారు విశేషమైన సేవలందిస్తున్నారన్నారు. ఈ వ్యవస్థను గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో బలోపేతం చేశారన్నారు. రెండుసార్లు వారికి వేతనాలు కూడా పెంచారన్నారు. ఇప్పుడు వారు మరింత మెరుగైన సేవలు అందించే విధంగా సెల్‌ఫోన్లు అందజేస్తున్నట్లు చెప్పారు. గతంలో లాగా ఇబ్బందులు తలెత్తకుండా అన్నీ ఫోన్ ద్వారా అప్‌డేట్ చేసే విధంగా వ్యవస్థను ఈ ప్రభుత్వం మరింత బలోపేతం చేసిందన్నారు. గతంలో అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్ల కోసం రోడ్డెక్కితే.. వారిని ఉద్యోగాల నుంచి తొలంగించే కుట్రలు చేశారన్నారు. మహిళలు అని కూడా చూడకుండా అవమానించారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ బల్లా పల్లవి, డైరెక్టర్లు పోతుల నరసింహులు, పరమేశ్వర్, బొమ్మినేని శివ, కార్పొరేటర్ జనబలం బాబా, క్లస్టర్లు శ్రీధర్, ఫిరోజ్ అహ్మద్, వన్నూరు, కేశవనాయుడు, టిడిపి నాయకులు సుధాకర్‌నాయుడు, సుధాకర్‌యాదవ్, నెట్టెం బాలకృష్ణ, వడ్డే భవాని, నాయుడమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంగన్వాడీలతో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

జిల్లాస్థాయి పోటీల్లో 'అనంతలక్ష్మి' ప్రతిభ

ప్రజాశక్తి-అనంతపురం

హిందూపురం పట్టణ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జోనల్ స్థాయి షాట్‌పుట్ క్రీడల పోటీలో అనంతలక్ష్మి కళాశాలకు చెందిన ఎంఎస్‌కె.చాందిని అత్యంత ప్రతిభ కనబరిచింది. అనంతలక్ష్మి కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్న చాందిని ప్రథమ బహుమతి సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. దీనికితోడు డిస్క్ క్రీడల పోటీలో ద్వితీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ కుటాల శ్రీనివాసులు తెలిపారు. అలాగే అనంతపురం పట్టణ డిప్లొమా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన జోనల్ స్థాయి క్రీడల్లో అనంతలక్ష్మి కళాశాలలో తృతీయ సంవత్సరం డిప్లొమా చదువుతున్న విద్యార్థులు బాలుర బాల్ బ్యాడ్మిటన్ పోటీల్లో తృతీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ అనంత రాముడు మాట్లాడుతూ ఐపిఎస్‌జిఎం 2025-26 జిల్లాస్థాయి పోటీల్లో కళాశాల డిప్లొమా విద్యార్థులు పాల్గొని మొదటి, ద్వితీయ తృతీయ బహుమతులు సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఆయా విద్యార్థులను ఛైర్మన్‌తోపాటు వైస్‌ఛైర్మన్ ఎ.రమేష్‌నాయుడు, ప్రిన్సిపాల్ కుటాల శ్రీనివాసులు, డిప్లొమా ఇన్‌ఛార్జి పురుషోత్తం, హరినాథ్, ఫిజికల్ డైరెక్టర్లు మల్లికార్జున, కుమారి ధనలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న అనంతలక్ష్మి యాజమాన్యం

మండలస్థాయిలోనే సమస్యలకు పరిష్కారం

తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఇక నుంచి ప్రజల సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించనున్నట్లు తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు భూ సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేందుకు రెవెన్యూ సిబ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో సమస్యను పరిష్కరించే విధంగా అన్నిశాఖల అధికారులు పాల్గొంటారన్నారు. కనుక అర్జీదారులు ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పట్టాదారు పాస్ పుస్తకం, ఇంటి పట్టాలు, భూముల సర్వే, రీ-సర్వే సమస్యలు, పక్కా ఇళ్ల నిర్మాణం, తదితర రెవెన్యూ, ఇతర సమస్యలు, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, హౌసింగ్, ఉపాధి హామీ, విద్యుత్, పండ్ల తోటల పెంపకం, ఆర్‌డబ్ల్యుఎస్, ఐసిడిఎస్ పాడి పరిశ్రమ, తదితర శాఖల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. కావున ప్రజలు సమస్యలు ఏవైనా ఇక్కడే ఇచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.



కౌన్సిలర్లను గుర్తించండి

కౌన్సిల్ సమావేశంలో వైసిపి కౌన్సిలర్ల అభ్యర్థన

ప్రజాశక్తి-పెనుకొండ

'కౌన్సిలర్లుగా గుర్తించండి.. వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కా రంలో తమను భాగస్వాము లను చేయండి' అని కౌన్సిల్ సమావేశంలో పలు వురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అభ్యర్థించారు. పట్టణంలోని నగర పంచాయతీ సమావేశ భవనంలో శనివారం ఛైర్మన్ ఉమర్ ఫరూక్ అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు పలు అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలను ప్రవేశపెట్టగా కౌన్సిలర్లందరూ తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం కౌన్సిలర్లు రఘునాథ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామాంజనేయులు, సద్దాం, శేషాద్రి, తదితరులు వార్డుల్లోని సమస్యలను ఏకరువు పెట్టారు. నగర పంచాయతీ పరిధిలోని వార్డుల్లో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. తమ వార్డుల్లో చేస్తున్న పనులను తమకు తెలియకుండానే అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలో చేపడుతున్నారని మండిపడ్డారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన తమకు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో భాగస్వాములు చేయాలని కోరారు. మేము చెప్పిన పనులను అధికారులు పెడచెవిన పెడుతున్నారని, సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. వార్డ్ పరిధిలో కనీసం వీధిలైట్లు వేయించుకోలేని దుస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధికి తాము ఆటంకం కలిగించమని, అభివృద్ధిలో తమను కూడా భాగస్వాములు చేయాలని వారు కమిషనర్‌ను కోరారు. కౌన్సిలర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో పూల దుకాణాల కారణంగా ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని తెలిపారు. పూల మార్కెట్‌ను నిర్మించి చాలా రోజులు అయిందని పూలు అమ్ము కునే వారిని మార్కెట్‌కు తరలిస్తే ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందని వివరించారు. ఎన్టీఆర్ కాలనీ, జగనన్న కాలనీల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని వాటిని పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఛైర్మన్ మాట్లాడుతూ కౌన్సిలర్లు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు. ఆయా వార్డుల పరిధిలో చేపట్టే సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను కౌన్సిలర్లకు తెలపాలని సూచించారు. సభ్యులు సూచించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు. సమావేశంలో కమిషనర్ సతీష్ కుమార్, వైస్‌ఛైర్మన్ సునీల్‌కుమార్, మున్సిపల్ అధికారులు వెంకటరమణ, రామ్మోహన్, కౌన్సిలర్లు గిరి, తయూబ్, భాస్కర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ ఉమర్‌ఫరూక్



భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి తహశీల్దార్

మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించండి

ప్రజాశక్తి-కొత్తచెరువు

పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం నాణ్యతతో అందించాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ బాలాంజనేయులు తెలిపారు. మండల పరిధిలోని లోచర్ల ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు కూరలు, భోజనం రుచిగా శుభ్రంగా అందించాల న్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, సమయపాలన పాటించాలన్నారు. అనంతరం పొలాల్లో రెవెన్యూ అధికారులు నిర్వహిస్తున్న భూ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. అలాగే పోతులకుంట గ్రామంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, టిడిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు : ఏవో

ప్రజాశక్తి-నంబులపూలకుంట

రైతులకు ఎరువులు, విత్తనాలు, మందులు, తదితర వాటిని అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని పి.కొత్తపల్లి, పెడబల్లి, ధనియాన్‌చెరువు, మేకలచెరువులో నిర్వహిస్తున్న ఫర్టిలైజర్ షాపులను శనివారం ఆయన సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని ఎరువులు అందుబాటులో ఉన్నాయని, వాటిని ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలని, అధిక ధరకు విక్రయిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు పంటలకు అధిక మోతాదులో యూరియా వాడరాదని సూచించారు. రైతు సేవా కేంద్రాల వద్ద సూచిక బోర్డులో ఎరువులు, నిర్ణీత ధరలు ప్రదర్శించాలన్నారు. ప్రతిరోజూ సాయంత్రం వ్యవసాయ కార్యాలయానికి ఎరువుల సమాచారం పంపాలని ఆదేశించారు.

వ్యక్తి మృతికి నివాళి

ప్రజాశక్తి-యల్లనూరు

పక్షవాతంతో మృతిచెందిన మండల కేంద్రంలోని పాతపేట శివారులో నివాసం ఉంటున్న డి.వెంకటేష్ (65) మృతికి వైసిపి నాయకులు శనివారం మృతిచెందారు. వెంకటేష్ కొంతకాలంగా పక్షవాతం వ్యాధితో బాధపడేవాడు. ఈనేపథ్యంలో గురువారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బోగతి విజయ్ ప్రతాప్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.

అన్నదానం

శింగనమల : రుషి శృంగమహాముని, శ్రీరంగరాయుల జ్ఞాపకార్థం మండల కేంద్రం సమీపంలోని మరువకొమ్మ వద్ద శనివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ యాదవ్ మాట్లాడుతూ స్వామి భక్తుల సహకారంతో 26వ శనివారం అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాయల ప్రకాష్, రుషింగమయ్య, కురుబ వీరన్న, రవియాదవ్, వాల్మీకి పుల్లయ్య నల్లప్ప, పవన్, ఆదెన్న, శీనా, నారాయణస్వామి, పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

మహిళలను లక్షాధికారులను చేయడమే లక్ష్యం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-శింగనమల

మహిళలను లక్షాధికారులను చేయడమే సిఎం చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. శనివారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎస్‌విఇపి (స్టార్టప్ విలేజ్ ఎంటర్ ప్రేన్యూర్) కార్యక్రమంపై వెలుగు సిబ్బంది, ప్రాజెక్ట్ డైరెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ఒక ఎంటర్ ప్రేన్యూర్ ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమన్నారు. ప్రతి ఒక్క సీఆర్పీ తమ గ్రామంలో ఔత్సాహికులైన ఎంటర్ ప్రేన్యూర్‌లను గుర్తించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు ఏర్పాటు

ప్రజాశక్తి-పుట్లూరు

మండల కేంద్రానికి చెందిన పుల్లారెడ్డి నీటి ట్యాంకును ఉచితంగా బించారు. మండల కేంద్రంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించేందుకు పుల్లారెడ్డి నాలుగు నెలల క్రితం కోటవీధిలో బోరు వేసిన విషయం తెలిసిందే. అప్పట్లో కోట వీధిలో 1500 లీటర్ల నీటి ట్యాంకును ఉచితంగా ఏర్పాటు చేశారు. ఈనేపథ్యంలో శనివారం కూడా సొంత డబ్బులు రూ.30 వేలు వెచ్చించి పైపులైను ద్వారా పాత సచివాలయం వద్ద 2000 లీటర్ల ట్యాంకు ఏర్పాటు చేసిన తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో ప్రజలు పుల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



తాగునీటి ట్యాంకు

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

పుట్లూరు : ప్రజాశక్తి దినపత్రిక రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సిఐ సిఐ సత్తిబాబు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి విలేఖరి చంద్రశేఖర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐ

తరిమెల శరత్ చంద్రారెడ్డికి నివాళి

ప్రజాశక్తి-శింగనమల

దివంగత వైసిపి నాయకులు తరిమెల శరత్ చంద్రారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శనివారం తరిమెలలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శరత్‌చంద్రారెడ్డి కుమారుడు, వైసిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి తరిమెల వంశీ గోకుల్‌రెడ్డి మాట్లాడుతూ తన తండ్రికి రైతులన్నా, రాయలసీమ ప్రాంతమన్నా ఎంతో ఇష్టమన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమన్నారు.



వెంకటరమణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

రాయదుర్గం : ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా విప్ కాలవ శ్రీనివాసులు, సతీమణి విజయలక్ష్మి పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గం అధ్యక్షులు నల్లపూల గాజుల వెంకటేశులు, పాలక మండలి సభ్యులు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంతమార్కెట్‌కు వేలంపాట

కుందుర్పి : మండల కేంద్రంలోని సంత మార్కెట్, సర్కార్ తోపునకు సంబంధించిన వాటిని సర్పంచు ఆధ్వర్యంలో శనివారం వేలంపాట నిర్వహించారు. ఈ వేలంపాటలో సంత మార్కెట్ రూ.3.13 లక్షలకు బోయ బొమ్మయ్య, సర్కార్ తోపులను రూ.1.21లక్షలకు రామచంద్ర దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు మారుతీశ్వర రామమూర్తి, పంచాయతీ కార్యదర్శి యల్లక్క, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



వేలంపాటలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి

పామిడి : గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం పామిడిలో చోటు చేసుకుంది. సిఐ శివశంకర్‌నాయక్ తెలిపిన కథనం మేరకు.. మతిస్థిమితం లేని ఓ వ్యక్తి శుక్రవారం సాయంత్రం జాతీయ రహదారి 44లో ఉన్న శ్రీనిధి డాబా సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమణించిన స్థానికులు చికిత్స నిమిత్తం పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజామున మృతిచెందినట్లు తెలిపారు. వ్యక్తి ఆచూకీ తెలిస్తే సీఐ నెం.94407 96827ను సంప్రదించాలని కోరారు.



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

రేషన్ బియ్యం పట్టివేత

పుట్లూరు : మండలంలోని నారాయణరెడ్డిపల్లి క్రాస్ వద్ద ఆటోలో తరలిస్తున్న పది బస్తాల బియ్యాన్ని శనివారం పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. యల్లనూరు మండలం గొడ్డుమర్రికి చెందిన కేదర్ నాగన్న పది రోజుల నుంచి పుట్లూరు మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేశాడు. సేకరించిన బియ్యాన్ని ముదిగుబ్బకు తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.



పట్టుబడిన బియ్యం ఆటో

ప్రజాశక్తి www.prajasakti.com



సిఐటియు నాయకులకు నగదు అందజేస్తున్న సందా రాఘవ

సిఐటియు విరాళాల సేకరణ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఈ నెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకూ విశాఖపట్నంలో జరిగే సిఐటియు ఆల్ ఇండియా మహాసభల నిర్వహణకు శనివారం పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు అయూబ్‌ఖాన్, పట్టణ రవాణా రంగం నాయకుడు ఎస్.రఫీ, పట్టణ మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు మేకల బాబు, ముకుంద, లక్ష్మీఓబులేసు, బి.ప్రసాద్, వెంకటేశులు, బాలమురళి, శీన మాస్ క్యాంపెయిన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యాపారవేత్త సందా రాఘవ రూ. 5వేలు విరాళం ఇచ్చారు.



కేంద్ర మంత్రి సోమన్నకు వినతి పత్రం ఇస్తున్న గుండుమల తిప్పేస్వామి

కేంద్ర మంత్రి సోమన్నకు 'గుండుమల' వినతి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

రైల్వే సహాయ మంత్రి సోమన్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించడానికి శనివారం హిందూపురం వచ్చారు. దీంతో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి ధర్మవరం-మచిలీపట్నం రైలును హిందూపురం- మచిలీపట్నం వరకూ నడపాలని కోరారు. తద్వారా మడకశిర, పెనుకొండ, హిందూపురం ప్రాంత విద్యార్థులు, వర్తకులు, వాణిజ్య సంస్థలు, ప్రజలకు అనుకూలంగా ఉంటుందని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిసింది.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని గౌని వారి పల్లి గ్రామంలో ఎన్ ఆర్ జి ఎస్ పథకం కింద 10 లక్షల వ్యయంతో శనివారం తెలుగుదేశం పార్టీ నాయకులు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు ఈ సందర్భంగా మండల కన్వీనర్ బాలకష్ణ చౌదరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి గ్రామాల్లో రోడ్ల అభివద్ధి జరుగుతోందన్నారు మంత్రి సవితమ్మ చొరవతో మండల వ్యాప్తంగా అభివద్ధి వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, పార్లమెంట్ కార్యదర్శి నరేష్, నిమ్మల శ్రీధర్, సింగిల్‌విండో రవిమోహన్, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ తిరుపాల్, డీలర్ నాగభూషణ, నాగేనాయక్, రోహిత్, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న బాలకృష్ణచౌదరి

నేడు యాదవ ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పుట్టపర్తిలో ఆదివారం అఖిల భారతీయ యాదవ మహాసభ ఆత్మీయ సమావేశం నిర్వహి స్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మీనరసప్ప యాదవ్ తెలిపారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు చంగా వెంగళరావు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగిస్తారన్నారు. సమావేశంలో యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారన్నారు. అలాగే యాదవులు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదిగేందుకు తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చిస్తారన్నారు. మహాసభలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని యాదవ సంఘం నాయకులు, యాదవ సామాజిక వర్గం ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



లక్ష్మీనరసప్పయాదవ్

బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు

ప్రజాశక్తి-గుత్తి

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారిణి శోభ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముక్కోటి ఏకాదశి ఉత్తర ద్వార దర్శనం కోసం ఈనెల 30, 31, జనవరి 1వ తేదీల్లో మూడు రోజులపాటు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు ప్రత్యేక పూజల కోసం ఏర్పాట్లు చేపట్టామన్నారు.

వేమారెడ్డి విగ్రహ ఏర్పాటుకు విరాళం

ప్రజాశక్తి-గోరంట్ల

పట్టణంలో వేమారెడ్డి విగ్రహ ఏర్పాటుకు మండలంలోని బూడిదిగడ్డపల్లి గ్రామానికి చెందిన జయచంద్రారెడ్డి కుమారుడు ఎన్ఆర్ఐ శేషాద్రి రూ. 5,00,116 విరాళం అందజేశారు. ఆ మొత్తాన్ని శనివారం శేషాద్రిరెడ్డి తల్లి ఓబుళమ్మ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం సభ్యులు, కులస్తులు పాల్గొన్నారు.



విగ్రహ ఏర్పాటుకు విరాళం ఇస్తున్న ఎన్ఆర్ఐ శేషాద్రిరెడ్డి తల్లి ఓబుళమ్మ

అడవికి నిప్పు పెడితే కఠిన శిక్షలు : కలెక్టర్, ఎస్పీ



అడవుల పరిరక్షణపై ముద్రించిన ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా అడవులకు నిప్పు పెడితే కఠిన శిక్షలు తప్పవని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ హెచ్చరించారు. అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు సమిష్టి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణంలోని కలెక్టర్ కార్యాలయంలో శనివారం జిల్లా అటవీ శాఖ అధికారి టి.చక్రపాణి ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా అటవీ పరిరక్షణ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడవుల్లో అగ్ని ప్రమాదాలను నివారించేం దుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ అడవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా అటవీ శాఖతో పాటు రెవెన్యూ, పంచాయతీ, డ్వామా, తదితర శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. అడవికి నిప్పు పెట్టే వ్యక్తులపై ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టం-1967 ప్రకారం కేసులు నమోదు చేసి, కనీసం 3 నెలల జైలు శిక్ష విధించాలని ఆదేశించారు. గొర్రెల కాపరులు, పశువులు మేపే వారు, అడవికి ఆనుకుని వ్యవసాయం చేసే రైతులు, వేటగాళ్లు, రహదారుల వెంట ప్రయాణించే వారు, అడవిలోని దేవాలయాలకు వెళ్లే భక్తులు, తదితరులు ఎవరైనా ఎట్టి పరిస్థితుల్లో అడవికి నిప్పు పెట్టకూడదని సూచించారు. అడవిలో అగ్ని ప్రమాదాలు జరిగితే వృక్ష, జంతుజాలం నాశనం కావడమే కాకుండా, వన్యప్రాణులు జనావాసాల్లోకి రావడం వల్ల మానవ-వన్యప్రాణుల సంఘర్షణకు దారి తీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అగ్ని ప్రమాదాల వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడం, నేలసారం తగ్గిపోవడం, నీటి కొరత, పశుగ్రాసం లభించకపోవడం, జీవవైవిధ్యం దెబ్బతినడం వంటి తీవ్ర ప్రభావాలు ఏర్పడతాయన్నారు. అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అటవీ శాఖ నిర్వహించే చైతన్య కార్యక్రమాల్లో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అడవుల పరిరక్షణకు డ్రోన్ కెమెరా నిఘా ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎక్కడైనా నిప్పు పెట్టినప్పుడు ఏ ప్రదేశంలో నిప్పు పెట్టారు, ఎంత విస్తీర్ణంలో ఉంది, నిప్పు పెడుతున్న మనుషులను గుర్తించడానికి డ్రోన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. డ్రోన్ వినియోగంపై అటవీశాఖ సిబ్బందికి శిక్షణ ఇస్తామని, చట్ట ప్రకారం నిప్పు పెట్టే వారికి కఠిన శిక్షలు వేస్తామన్నారు. వన్యప్రాణులు-మనుషుల మధ్య సంఘర్షణను నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన 'హనుమాన్ ఫౌండేషన్'పై కూడా చర్చించారు. ఈ ఫౌండేషన్‌లో భాగంగా పెనుకొండ కేంద్రంగా ఒక ర్యాపిడ్ రెస్పాన్స్ అండ్ రెస్క్యూ టీమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అందులో అటవీ శాఖ సిబ్బందితో పాటు ఆసక్తి ఉన్న స్థానిక యువత స్వచ్ఛందంగా పాల్గొనవచ్చని తెలిపారు. పాములు పట్టడం, వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించి అటవీ శాఖ ఆధ్వర్యంలో యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యువత స్థానిక అటవీ శాఖ అధికారులను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అంతకుముందు జిల్లాలో అడవుల పరిరక్షణపై తీసుకుంటున్న చర్యలను జిల్లా అటవీ శాఖ అధికారి టి.చక్రపాణి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అలాగే జిల్లాలో అడవుల పరిరక్షణపై ముద్రించిన ప్రచార పోస్టర్లను అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి కలెక్టర్, ఎస్పీ ఆవిష్కరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.మౌర్యభరద్వాజ్, సామాజిక వన విభాగం అటవీ శాఖ అధికారి శ్రీనివాసులు, డిఆర్‌డిఎ పిడి నరసయ్య, డ్వామా, పంచాయతీ, విద్య, అగ్నిమాపక శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు పటిష్ట చర్యలు:ఎస్పీ

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

మహిళల భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తియాప్, శక్తి వాట్సాప్ నంబర్ల పై, మహిళల పై జరిగే నేరాలు, సైబర్ నేరాల గురించి పాఠశాలలు, కళాశాలల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్‌ల అధికారులు , శక్తి టీం బాఆందాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, విద్యార్థినిలకు , మహిళలకు వాటి సేవలను వివరిస్తున్నారని జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. శక్తి టీం బందాలు మహిళలకు, బాలికలకు పాఠశాల, కళాశాలలో విద్యార్థినిలకు శక్తి యాప్, సైబర్ నేరాలు , గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, ఈవ్ టీజింగ్ లపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో శక్తి టీం బృందాలు జన సంచారం ఉన్న ప్రాంతాలతో పాటు, పలు పాఠశాలల్లో విద్యార్థులకు డయల్ 112, డయల్ 100,1098, 1930, శక్తి యాప్ , మహిళలు అత్యవసర సమయాల్లో నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు శక్తి' వాట్సప్ 7993485111 నెంబర్ ను మహిళలు, చిన్నారుల భద్రత కోసం సేవ్ చేసుకోవాలన్నారు. ఎక్కడైనా గంజాయి , డ్రగ్స్, మాదక ద్రవ్యాల సేవించడం చూసినా విక్రయాలు, వినియోగం గురించి సమాచారం తెలిస్తే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 కు అందించాలన్నారు. ఈవ్‌టీజింగ్, ప్రేమ పేరుతో మోసాలు , మహిళలపై జరిగే నేరాలపై, చట్టాలపై అవగాహన కల్పించారు. 2025 జనవరి నుండి డిసెంబర్ 27 వరకు శక్తి యాప్‌ను జిల్లాలో 21,033 మంది డౌన్లోడ్ చేసుకున్నారని జిల్లా ఎస్పి తెలిపారు.

విశాఖ శ్రామిక ఉత్సవానికి తరలిన పిఎన్ఎం కళాకారులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిఐటియు 18 వ అఖిలభారత మహాసభల సందర్భంగా శనివారం నుండి విశాఖపట్నంలో నిర్వహించే శ్రామిక ఉత్సవ్‌లో పాల్గొనేందుకు కర్నూలు జిల్లా ప్రజానాట్యమండలి కళాకారులు శనివారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఇ.రాజు ఆధ్వర్యంలో 22 మంది కళాకారులు విశాఖకు వెళుతున్నట్లు తెలిపారు. కర్నూలు రైల్వే స్టేషన్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి.అంజిబాబు, చిన్న వ్యాపారస్తుల సంఘం న్యూ సిటీ నాయకులు ఎస్. ఎండి. రఫీలు వారికి సెండ్ ఆఫ్ చెప్తూ మాట్లాడారు. కర్నూలు జిల్లా ప్రజానాట్యమండలి కళాకారులు ఆట, మాట, పాట, నాటికలు, నృత్య రూపకాలతో విశాఖలో జరిగే శ్రామిక ఉత్సవంలో తమ ప్రతిభను కనబరిచి కర్నూలు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఈ మహాసభలో సామాన్య ప్రజలు, శ్రామిక, రైతు, ఉద్యోగ కార్మికులందరి కష్టాలను కళ్లకు కట్టినట్లు కళాకారులు తమ ప్రదర్శన ద్వారా ప్రజలను చైతన్య పరుస్తూ ఆలోచింపజేసే విధంగా ఉండాలని చెప్పారు. ఈ మహాసభలో ప్రతినిధులు చర్చించుకుని భవిష్యత్తు కర్తవ్యాలను నిర్ణయించుకొని పోరాటాలకు సిద్ధమవుతారన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేసేందుకు లక్షలాదిగా ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పతకాలతో తిరిగి రండి

ఇన్‌చార్జ్ విసి ఆచార్య వి.వెంకట్ బసవరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

క్రీడాకారులు అప్రమత్తంగా ఉండి పథకాలతో తిరిగి రావాలని ఇన్‌చార్జ్ విసి ఆచార్య వి.వెంకట్ బసవరావు ఆదేశించారు. శనివారం క్లస్టర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ మహిళా క్రీడాకారిణులకు కిట్లు వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు పంపిణీ చేశారు. ఫుట్‌బాల్ మెలకువలు నేర్చుకుంటే అద్భుతంగా రాణించవచ్చన్నారు. ఫిఫా వరల్డ్‌కప్ మ్యాచ్‌లు పరిశీలిస్తే భారత్ ప్రాతినిధ్యం సాధ్యమని చెప్పారు. రోనాల్డ్, మెస్సీ వంటి ప్రముఖులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలోరిజిస్ట్రార్ డాక్టర్ జి. శ్రీనివాస్ ,స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ వై.శ్రీనివాస్ రెడ్డి, కెప్టెన్ ఎం. రేణుక, మేనేజర్ ఎ.అంజలి, కోచ్ కె.బ్రహ్మకుమారి ఉన్నారు.

ఎరువులు, మందుల దుకాణాలపై ఎడిఎ దాడులు

ప్రజాశక్తి-సి.బెళగల్

ఎరువుల, మందుల దుకాణాలపై ఎమ్మిగనూరు వ్యవసాయ సంచాలకులు ఎడిఎ ఎస్ఎండి ఖాద్రి శనివారం ఎఒ మల్లేష్ కుమార్ అధ్యక్షతన దాడులు చేశారు. మన గ్రోమోర్, మన అగ్రిస్టోర్, శివసాయి, నాగసాయి, మురళిసాయి, శ్రీమంజునాథ, మన అన్నపూర్ణ దుకాణాలలో తనిఖీలు చేపట్టి పలు రికార్డులను పరిశీలన చేశారు. స్టాక్ బోర్డులలో ఏరోజుకారోజు స్టాకు వివరాలను కనపరచాలన్నారు. రైతులకు కొనుగోళ్ళపై బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, ఎవరైనా అక్రమంగా ఎరువులు, మందులు నిల్వలు చేస్తే, లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.



క్రీడాకారులతో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-వెలుగోడు

వెలుగోడు పట్టణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కబడ్డీ, కోకో క్రీడాకారులకు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో 20 వేల రూపాయల విలువచేసే క్రీడా దుస్తులను నాయకులు జయరామిరెడ్డి, సుల్తాన్ మోహిద్దీన్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు హెచ్ఎం మాలిక్ ఖాన్ చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాలిక్ ఖాన్, ఇన్చార్జ్ హెచ్ఎం మొయినుద్దీన్, ఉపాధ్యాయులు రామకృష్ణ మాట్లాడుతూ పాఠశాల మౌలిక వసతులతో పాటు క్రీడాకారుల అభ్యున్నతి కోసం పూర్వ విద్యార్థుల సంఘం వారు చేస్తున్న సేవలు అభినందనీయ మన్నారు. అదే సమయంలో క్రీడాకారులు చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రతిభను చాటి జాతీయస్థాయికి ఎదగాలన్నారు. జిల్లాస్థాయిలో పాఠశాల కబడ్డీ క్రీడాకారులు విజేతలుగా నిలవడం సంతోషకరమన్నారు. అదే ఉత్సాహంతో జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ప్రతిభగల క్రీడాకారులుగా తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులను కోచ్ సయ్యద్ అబ్దుల్ వాహీద్‌లను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శేషశైన శర్మ, శంషుద్దీన్, ముల్లా అబ్దుల్ రఫీ, మజాహర్ అలీ ఖాన్, సుఫియాన్, శ్రీను, రిహాన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-అగళి

మండల కేంద్రమైన అగళి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని బి.దీక్షిత కౌశల్-2025 రాష్ట్రస్థాయి సైన్స్ క్విజ్ పోటీలో ప్రతిభ చాటి నాల్గో స్థానంలో నిలిచినట్లు హెచ్ఎం పి.మస్తాన్‌ఖాన్ తెలిపారు. దీక్షిత రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నుంచి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నారు. దీక్షితకు గైడ్‌గా హెచ్ఎం పి.మస్తాన్‌ఖాన్, బి.షబ్బీర్ వ్యవహరించారు. విద్యార్థిని దీక్షితను హెచ్ఎంతోపాటు గేట్ సభ్యులు కృష్ణమూర్తి, చంద్రశేఖర్ నాయుడు, పాఠశాల సిబ్బంది ప్రశంసించారు.

29న జిల్లాస్థాయి రెవెన్యూ క్లినిక్స్ నిర్వహణ

7 విభాగాల్లో సేవలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్


జిల్లాలో ప్రజల రెవెన్యూ సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించాలనే ఉద్దేశ్యంతో ఈ నెల 29వ తేదీ సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆవరణలో మొత్తం 7 రెవెన్యూ క్లినిక్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి రెవెన్యూ సంబంధిత అర్జీలను స్వీకరించి, వాటిని నమోదు చేసి, సమస్యల స్వరూపాన్ని బట్టి అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపడతామన్నారు. ఇందుకోసం సంబంధిత విభాగాలకు చెందిన ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్లు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందిస్తారని తెలిపారు. రెవెన్యూ క్లినిక్స్‌ను రెవెన్యూ, గ్రామ, వార్డు సచివాలయ సేవలు, అడంగల్ సవరణలు, 22ఎ, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలు, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్ కేసులు, సర్వే, రీ-సర్వే, దేవదాయ, వక్ఫ్ భూములు తదితర విభాగాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఆత్మకూరు

తెలుగుదేశం పార్టీ ఒక కుటుంబంలాంటిదని, పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. టిడిపి జిల్లా కార్యవర్గ నిర్వాహక సభ్యుడిగా ఎన్నికైన తిమోతి ఎమ్మెల్యేను శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరికి ఏదో ఒక రోజు పదవులు దక్కుతాయని, పదవులు ఉన్నా లేకున్నా ప్రజల కోసం పని చేస్తూ ప్రజలలో పార్టీ విధానాలను తీసుకువెళ్లాలన్నారు. ఆ దిశగా తిమోతి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని సన్మానిస్తున్న తిమోతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జంగాలపల్లి పెద్దన్న

రైతు సంఘం నాయకుని అరెస్టు దుర్మార్గం

జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఎపి రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.అప్పలరాజుపై పిడి చట్టం బనాయించి అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్యని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న తెలియజేశారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూండాలు, రౌడీ షీటర్లు, ఆడపిల్లలను అమానుషంగా కబలించే మానవ మృగాలపై పెట్టే పిడి చట్టాన్ని పోలీసులు ప్రయోగించాల్సి ఉందన్నారు. అలా కాకుండా ప్రజలు, రైతుల సమస్యలపై నిత్యం ఉద్యమించే నేతలపై పెట్టడం దుర్మార్గం అన్నారు. 20 ఏళ్ల నుంచి అనేక ఉద్యమాలు నిర్వహించి నాయకత్వం వహించిన అప్పలరాజుపై పెట్టిన 19 కేసుల్లో 13 కేసులను కోర్టు రద్దు చేసిందన్నారు. గంజాయి, ఎర్రచందనం స్మగ్లర్లు, భూతగదాల్లో తలదూర్చి వేల కోట్ల రూపాయలు సంపాదిస్తున్న వారి మీద, వైట్ కాలర్ నేరాలు చేసే వారిపై పెట్టాల్సిన పిడి యాక్ట్‌ను అప్పలరాజుపై పెట్టడం బాధాకరమన్నారు. ప్రజాస్వామ్యయుతంగా ప్రజల సమస్యలపై మాట్లాడుతున్న వ్యక్తులపై ఈ యాక్టు పెట్టడం మానవ హక్కులను ఉల్లంఘించడమే అన్నారు. అరెస్టు చేసిన అప్పలరాజును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దిల్షాద్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమ అభివృద్ధికి నిధులివ్వండి

కేంద్ర మంత్రిని కోరిన జలసాధన సమితి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

కరువు, తీవ్ర వర్షాభావ పరిస్థితులతో అనాధిగా ఇబ్బందులకు గురవుతున్న రాయలసీమ అభివద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించాలని రైల్వే సహాయ శాఖ మంత్రి సోమన్నకు జలసాధన సమితి నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. వందేభారత్ రైలు ప్రారంభోత్సవానికి హిందూపురానికి విచ్చేసిన ఆయన్ను కలిసి రాయలసీమ సమస్యలపై వినతిని అందించారు. రాయలసీమ నీటి ప్రాజెక్టులు, ప్రధానమంత్రి కిషి సంచాయి యోజన పథకం కింద నిధులు విడుదల చేయాలని కోరారు. పెన్నా నది పునరుజ్జీవనానికి కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు. తీవ్ర కరువు ప్రాంతమైన రాయలసీమ అభివద్ధికి "రాయలసీమ అభివద్ధి మండలి" ఏర్పాటుచేసి నిధులు విడుదల చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ధనాపురం వెంకట్రామిరెడ్డి, జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, ఓపిడిఆర్ నాయకులు ఎం. శ్రీనివాసులు, జలసాధన సమితి నాయకులు దాసరి హరి, పర్యావరణ పరిరక్షణ నాయకులు చౌడప్ప తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిని ఇచ్చి సమస్యలను వివరిస్తున్న జలసాధన సమితి నాయకులు

కళాశాలలు, పాఠశాలల అభివృద్ధికి కృషి

ఎంపి బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. నగరంలోని కెవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీ నిధులు రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన షెడ్డును ఆయన ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయన్నారు. ఎంత కష్టపడితే అంత ఫలితం వస్తుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అంతకుముందు తన ఎంపీ నిధులు కేటాయించి కళాశాలలో షెడ్డును నిర్మించిన ఎంపీ నాగరాజును కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు సన్మానించారు.. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ.ఓ లాలెప్ప, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ ప్రభు చరణ్,కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

స్టాంటన్‌పురంలో క్రిస్మస్ వేడుకలు

స్టాంటన్ పురంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో కెడిసిసిబి ఛైర్మెన్ విష్ణువర్ధన్ రెడ్డి, కర్నూలు పార్లమెంట్ ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీ బస్తీపాటి నాగరాజు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, ఐక్యతకు ప్రతీక అని పేర్కొంటూ, అన్ని మతాలు పరస్పర గౌరవంతో ఉండాలని పేర్కొన్నారు.కెడిసిసిబి ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రేమ, క్షమ, త్యాగం, శాంతి మానవత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో అన్ని మతాల మధ్య సౌహార్దం, ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ, పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. యేసుక్రీస్తు బోధించిన ప్రేమ సందేశం ప్రతి మనిషి జీవితంలో ప్రతిబింబించాలని అన్నారు.ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ముందుగా క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, క్రిస్మస్ పండుగ ప్రేమ, త్యాగం, శాంతి సందేశాన్ని అందిస్తుందని పేర్కొంటూ, సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని కోరారు. వార్డు ఇన్చార్జి కురువ చంద్రశేఖర్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, క్రైస్తవ సంఘ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి చట్టాన్ని కొనసాగించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విబిజిరామ్‌జి స్కీమ్‌ను రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీచట్టాన్ని కొనసాగించాలని వామపక్ష పార్టీలు, ఈరోజు డిఆర్‌ఒకు వినతిపత్రం ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వాళ్లలో సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణ, కెవి.నారాయణ, నగర కార్యదర్శి రాజశేఖర్, సిపిఐ జిల్లా నాయకుడు శ్రీనివాసులు ఉన్నారు. వారు వినతిపత్రంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని వామపక్ష పార్టీల మద్దతుతో ఏర్పడిన నాటి యుపిఎ ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. సరిగా 20 సంవత్సరాల తర్వాత మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని, రద్దుచేసి విబిజిరామ్‌జి స్కీముగా మార్పు చేసి గ్రామీణ పేదలకు, బడుగు బలహీన వర్గాల వారికి పట్టెడన్నం పెట్టే చట్టాన్ని రద్దు చేయడం దుర్మార్గమని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ చట్టం వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధి, రైతుల అభివృద్ధి జరిగిందన్నారు. పేదల వలసలు తగ్గాయని, కరోనా కాలంలో రైతులకు కూలీ పేద ధనిక అని తేడా లేకుండా అందర్నీ ఆదుకున్న చట్టం ఉపాధి హామీ చట్టమని వారు వినతి పత్రంలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బుద్ధిపూర్వకంగా పెట్టుబడి దారులు, కార్పొరేట్లకు ఊడిగం చేసే ప్రభుత్వమని వారు విమర్శించారు. 125 రోజుల పని దినాలు కల్పిస్తామంటూ తప్పుడు ప్రచారం చేసి 90 శాతం ఇచ్చే నిధులను 60శాతం కుదించారన్నారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి మహాత్మా గాంధీని హత్య చేసిన నాథు రాం గాడ్సే పేరు కలిసేలాగా చేర్చి, రామరాజ్యం కావాలని కలలు కన్నవాడు మహాత్మా గాంధీ అందుకే రామ్ అనే పేరు కలిసేలాగా చేర్చామని చెప్పడం సిగ్గుచేటని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని విబిజి రాంజీని రద్దు చేయాలని కోరారు.